# సంపూర్ణత్వం

## -రాంభూపాల్‌రెడ్డి

**వివిధ రకాల కంపెనీలకు సంబంధించిన కంప్యూటర్స్ అక్కడ సిస్టమాటిక్‌గా వుంచబడ్డాయి. అది ఎబి కంప్యూటర్ కన్సల్టెన్సీకి సంబంధించిన హెడ్ ఆఫీస్. లేడీ రిసెప్షనిస్ట్ ఉద్యోగం కోసం పేపర్‌లో ప్రకటన ఇచ్చారు. పది గంటలకు ఇంటర్‌వ్యూ మొదలవుతుందన్నారు. పదిన్నర అవుతోంది. ఇంకా ఎమ్‌డి రాలేదట. అక్కడ వున్న ఏసి చల్లదనం బద్ధకాన్ని పెంచుతోంది. ఇద్దరు అమ్మాయిలు గుసగుసలాడుకుంటూ ఎమ్‌డిని తిట్టుకుంటున్నారు. నేను కూడా!**

ఎమ్‌డిగారొస్తున్నారు! అన్నారెవరో.

సూట్‌లో వున్న ఒకతను వేగంగా ఆఫీసలోకి వచ్చాడు. ఒక విధమైన మృదువైన పరిమళం నన్ను దాటుకుని పోయింది. నేను నాకు తెలియకుండానే లేచి నిలబడ్డాను.

అతను...అతను... బాలూ! అవును... బాలూయే. ఆరు సంవత్సరాల తర్వాత మళ్లీ ఇలా!

ఏసి చల్లదనం సడెన్‌గా కొండగాలి చల్లదనంలా అనిపించింది. అప్పుడు అనిపించింది. అప్పుడు కూడా నన్ను సర్‌ప్రైజ్ చేస్తూ సడెన్‌గా కనిపించేవాడు బాలూ.

అక్కడ జరుగుతున్నదేదీ కనిపించడంలేదు. బాలు గురించే ఆలోచిస్తున్నాను. ఆఫీస్ బాయ్ ఒక్కొక్కరినే పిలుచుకువెళ్తున్నాడు. నా వంతు వచ్చింది.

లోపల బాలుతోపాటు ఇంకొక వ్యక్తి కూర్చుని వున్నాడు. బాలూ తలొంచుకుని నా బయోడేటా కాగితాలనుకుంటా! చూస్తున్నాడు. విష్ చేసాను.

''ప్లీజ్ బీ సీటెడ్'' అంటూ బాలూ కుర్చీ చూపిస్తూ నావంక చూసాడు ఒక్క క్షణం. బాలూ నన్ను గుర్తు చేసుకునేందుకు ఆలోచించిన గుర్తుగా అతని నుదురుపైకి లేచింది. తరువాత క్షణంలో మా ఇద్దరి కళ్లు కలుసుకున్నాయి. నాకయితే ప్రక్కనున్నతను కనిపించనట్లు అయ్యింది.

''కూర్చోండి'' అని ప్రక్కతను అనడంతో తేరుకుని కుర్చీలో సర్దుకుని కూర్చున్నాను.

ప్రక్కతనే ప్రశ్నలడుగుతూ వున్నాడు. బాలూ అలాగే చూస్తూ వున్నాడు.

''రేపు ఉదయం ఫోన్ చేయండి. ఏ విషయమూ చెప్తాము'' అన్నాడతను. థాంక్స్ చెప్పి లేస్తుంటే అతనే అడిగాడు ''రిసెప్షనిస్టుకు ఉండవలసిన ముఖ్యమైన అలవాటు ఏమిటో తెలుసా?''

ఏమిటన్నట్లు చూసాను.

''పెదవులపై చిరునవ్వు'' అన్నాడు నవ్వుతూ.

★★★

మరుసటిరోజు ఫోన్ చేస్తే నేను సెలెక్ట్ అయినట్టు, రెండుమూడురోజుల్లో ఎప్పుడైనా వచ్చి జాయిన్ కమ్మని చెప్పారు. ఆ మరుసటిరోజే వెళ్లి జాయిన్ అయ్యాను.

అదేరోజు సాయంత్రం ఆఫీస్ బాయ్ వచ్చి ''మిమ్మల్ని ఎమ్‌డిగారు పిలుస్తున్నారు'' అని చెప్పాడు. ఇంటర్‌కమ్‌లో పిలవొచ్చు కానీ ఆఫసబాయ్‌ని పంపించాడు.

తలుపు తోసుకుని లోపల అడుగుపెట్టాను.

బాలు తలెత్తి చూసి నవ్వాడు. బాలూది అదే నవ్వు.

''పిలిచారట'' అన్నాను.

కూర్చోమన్నట్లు కుర్చీ చూపించాడు. కూర్చుని అతనివంక చూసాను. ''నన్ను గుర్తుపట్టారా?'' అడిగాడు.

''నిన్ను గుర్తు పట్టకుంటే ఎలా నేస్తం? గడిచిన నా జీవితపు కాలాన్ని పూలతో పోలిస్తే అందులో ఎక్కువగా గడ్డిపూలే అయినా నీతో గడిపిన క్షణాలు పారిజాత సుమాలు'' మనసులో అనుకున్నాను. గుర్తు పట్టినట్టు తలూపాను.

బాలూ ఆఫీస్‌బాయ్‌ని పిలిచి రెండు ఆరేంజ్ జ్యూస్ తెమ్మని చెప్పాడు.

మీరు అనే మర్యాదైన పిలుపు ఇద్దరికీ ఇబ్బందిగా అనిపించింది.

''నీ బయోడేటాలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో వుంటున్నట్లు వుంది. మీ అమ్మా నాన్నా ఎక్కడున్నారు?'' అని అడిగాడు.

''నాన్న పోయి నాలుగేళ్లయింది. అమ్మ మామయ్య వాళ్ల వద్ద ఊర్లో వుందని'' చెప్పాను.

చల్లగా వున్న ఆరేంజ్ జ్యూస అతనికి కూడా వేడిగా అనిపించి వుండాలి. ఒక సిప్ చేసి క్రింద పెట్టేసాడు.

''నీవు ఉగాదికి నాతోపాటు మా ఊరికి రావాలి. మా ఇంట్లో మూడురోజులు వుండాలి'' అన్నాడు బాలు సడెన్‌గా.

తలెత్తి అతని మొహంలోకి చూసాను. సరేనన్నట్లు తలూపాను.

★★★

రాత్రి నాకు నిద్ర పట్టలేదు. ప్రక్కకు తిరిగి చూసాను. ఇందిర నిద్రపోతోంది. మెల్లగా శబ్దం కాకుండా మంచంపై ఉంచి దిగి కిటికీ దగ్గరకెళ్లి కూర్చున్నాను.

బాలూతో పరిచయం నేను పదవ తరగతిలో వుండగా జరిగింది. ఒకరోజు సాయంత్రం నేను స్కూలునుంచి రాగానే మొహం కడుక్కుని వెళ్లి వీణ సాధన చేస్తూ కూర్చున్నాను.

''ఈ సంవత్సరం నీవు పదవ తరగతిలో వున్నావు. వీణ, సంగీతం అంటూ నీవు సరిగా చదవకపోతే పాస్ కావడం కష్టం. ఇదొక్క సంవత్సరం దాన్ని పక్కనపెట్టి బుద్ధిగా చదువుకో'' అంటూ అమ్మ నసుగుతోంది.

అమ్మానాన్నలకు నేను ఒక్కత్తే కూతుర్ని కావడంతో నేనంటే ఇద్దరికీ చాలా ఇష్టం. నాన్నకయితే మరీను. అందుకే ఆర్థికంగా స్తోమత లేకున్నా నా ఇంట్రెస్టు గమనించి నాకు ఒక వీణ కొని సంగీతం స్కూలుకు కూడా పంపుతున్నారు. నేను కవితలు కూడా రాసేదాన్ని. అమ్మ నవ్వేది కానీ నాన్న ఎంకరేజ్ చేసేవాడు.

ఇంటిముందు రిక్షా ఆగిన శబ్దం కావడంతో అమ్మ బయటకు వెళ్లింది.

''ఏమండీ! ఏమయింది?'' అంటూ అమ్మ గొంతు కంగారుగా వినిపించడంతో నేను వీణ పక్కనపెట్టి బయటకు పరుగెత్తాను. నాన్న రిక్షాలోంచి దిగుతున్నాడు. ఒక అబ్బాయి నాన్నకు ఆసరాగా చేయి పట్టుకుని ఉన్నాడు.

''ఈయన రోడ్డుమీద వస్తూ కళ్లు తిరిగి పడబోతుంటే పట్టుకుని తీసుకువస్తున్నాను'' అన్నాడు ఆ అబ్బాయి.

''ఈ అబ్బాయిగానీ రాకుంటే నాకు చాలా పెద్ద ఆక్సిడెంట్ జరిగుండేది ఇవ్వాళ'' అన్నాడు నాన్న.

నేను వెళ్లి నాన్న చెయ్యి పట్టుకున్నాను.

''నూరేళ్లు చల్లగా బ్రతుకు బాబూ'' అంటూ అమ్మ నాన్నని పట్టుకుని నాతోపాటు లోపలకు నడిపించుకుంటూ వచ్చింది. ఇంతలో పక్కింటావిడ,



పిల్లలూ ఇంట్లోకి వచ్చారు ఏం జరిగిందంటూ. అమ్మ వాళ్లకు జరిగింది చెప్తోంది. నేను ఆ అబ్బాయి కొరకు బయటకు వెళ్లాను. అప్పుడే తను రిక్షా డబ్బులు ఇచ్చి వెనుదిరిగాడు.

నావంక చూసి వెళ్లొస్తానన్నట్లు తల వూపి వెళ్లబోతుంటే ''రిక్షా డబ్బులు'' అని గొణిగాను. అతను నవ్వుతూ ''ఫర్వాలేదు'' అంటూ వెళ్లిపోయాడు.

మరుసటిరోజు సాయంత్రం గదిలో కూర్చుని వీణ సాధన చేస్తున్నాను. నాన్న మంచంపై పడుకుని కళ్లు మూసుకుని వింటున్నాడు. అమ్మ ఇంట్లోలేదు. కొద్దిసేపైన తరువాత ప్రక్కన అలికిడి అవడంతో తల తిప్పి చూసాను. ఎప్పుడొచ్చాడో తెలీదు. ఆ అబ్బాయి క్రింద కూర్చుని నావంకే చూస్తున్నాడు. నన్నుచూసి పలకరింపుగా నవ్వాడు. ఇంతలో నాన్న కూడా ఆ అబ్బాయిని చూడడంతో అతనే లేచి మంచంమీద కూర్చుంటూ నాన్న ఆరోగ్యం గురించి అడిగాడు.

నేను లోపలికి వెళ్లి టీ చేసే ప్రయత్నంలో పడ్డాను. నాన్న ఆ అబ్బాయి వివరాలు అడుగుతుంటే అతను చెప్తున్నాడు. తన పేరు బాలసుబ్రహ్మణ్యం అనీ, అందరూ బాలూ అని పిలుస్తారనీ, తను ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నట్లు, తనది ప్రక్కన వున్న పల్లెటూరు అనీ, తనిక్కడ ఫ్రెండ్స్‌తో కలిసి వుంటున్నట్లు కూడా చెప్పాడు. అయితే అతను మధ్యమధ్యలో నాన్ననుకూడా వివరాలు అడుగుతూ కొత్తవ్యక్తితో మాట్లాడుతున్నట్లు కాకుండా ఫ్రీగా మాట్లాడాడు. అమ్మ వచ్చాక కాసేపు వుండి టీ తాగి వెళ్లిపోయాడు.

తరువాత అప్పుడప్పుడు వస్తూ వుండేవాడు. అతనిలో వున్న కలిసిపోయే గుణమో ఏమోగానీ మొత్తానికి అతను వచ్చినప్పుడు మేము ముగ్గురం అతనితో ఉత్సాహంగా కబుర్లు చెప్పేవాళ్లం.


బాలూ రాసే కవితలను మెచ్చుకునేవాడు. అతను నేను రాసిన కవితలన్నీ కాపీ చేసుకున్నాడు. అయితే ఒకసారి వాళ్ల నాన్నగారు వచ్చినప్పుడు ఆ కవితలు చూపించాడట. ఆయన మెచ్చుకుని ఎవరు రాసారని అడిగితే నా గురించి చెప్పాడట. ఆడపిల్లలు ఇలా కవితలు రాయడానికో లేక వంట చేయడానికో పరిమితం కాకుండా బాగా చదువుకుని ఉన్నత స్థితికి రావాలని, కవితలు ఈ రోజుల్లో తిండి పెట్టవని ఆయన అన్నాడట. ఆ రోజు నుంచీ నాలో కలిగిన ప్రతీ చిన్న భావాన్ని కవితగా రాయాలని ప్రయత్నించడం మానుకున్నాను.


బాలూ మా ఇంట్లో నాలుగో మెంబరన్నంతగా కలిసిపోయాడు. బాలూతో నా సాన్నిహిత్యం ఎంతగా పెరిగిపోయిందంటే అతన్ని చూడకుండా వుండలేనని పించింది. ఈ రోజువరకూ అతనుగానీ అతని చిరునవ్వు గానీ గుర్తుకురాని రోజులేదు.

ఎగ్జామ్స్ దగ్గర పడడంతో బాలూ మా ఇంటికి రావడం తగ్గించాడు. నేనూ ఎగ్జామ్స్ మీద దృష్టి కేంద్రీకరించాను. అయితే నా ఎగ్జామ్స్ పూర్తయిన వెంటనే మేము ఆ ఊరు విడిచి గుంటూరు వెళ్తున్నట్టు తెలిసింది. నాకు వెంటనే బాలూయే గుర్తుకువచ్చాడు.

ఎగ్జామ్స్ పూర్తయ్యాక మేము ఊరు వెళ్లబోయే ముందు రోజు బాలూ మా ఇంటికి వచ్చాడు. ఇంట్లో నేనొక్కత్తినే వున్నాను. బాలు తనతోపాటు తెచ్చిన పుస్తకాన్ని నాకిచ్చాడు. అందంగా బైండ్ చేయబడి ఉందది. అట్ట తెరిచి చూసాను.

''ప్రియమైన నేస్తంకు...బాలు'' అని రాసి వుంది.




లోపల తీసి చూసాను. ఆనందోద్వేగంతో నాకు నోట మాట రాలేదు. అందులో నేను రాసిన కవితలన్నీ అచ్చువేసి వున్నాయి. తలెత్తి బాలు వంక చూసాను. బాలూ నా దగ్గరగా వచ్చి నా బుగ్గమీద గాఢంగా ముద్దు పెట్టాడు. చేత్తో బుగ్గమీద అపురూపంగా తడుముకున్నాను.

మరుసటిరోజు సెండాఫ్ ఇవ్వడానికి బస్ దగ్గరకు వచ్చాడతను. ''వెళ్లిన వెంటనే మీ అడ్రస్ తెలుపుతూ వుత్తరం వ్రాయి'' అన్నాడు.

బస్సు కదులుతుంటే నా కళ్లల్లోకి నీళ్లు వచ్చాయి. బాలూ చెయ్యి ఊపుతున్నాడు. నేనూ చెయ్యెత్తాను. నా చెయ్యి, పెదవులు వణికాయి.

గుంటూరు వెళ్లిన తరువాత మా ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారింది. ఆ సమయంలో బాలూకి ఉత్తరం వ్రాయడం నాకు ఇబ్బందిగా అనిపించింది. ఆ తరువాత నాన్నగారు పోయినప్పుడు కూడా అతనికి తెలుపలేదు. సహాయం కోరినట్లు అవుతుందని నేను ఎప్పుడూ అతనికి ఉత్తరం రాయలేదు. మళ్లీ ఇన్నిరోజుల తర్వాత ఇలా కలిసాం.

★★★

కార్లో వాళ్ల ఊరికి వెళ్లాము. చాలా చిన్న ఊరది. కారు వెళ్లి ఒక పెద్ద ఇంటి ముందు ఆగింది. కొంతమంది పిల్లలు కారు చుట్టూ మూగారు. ఇంట్లోకి అడుగుపెడుతూనే చల్లటిగాలి మొహాన్ని తాకింది.

బాలూ నన్ను వాళ్ల అమ్మనాన్నలకు పరిచయం చేసాడు. వాళ్లు చాలా ఆప్యాయంగా మాట్లాడారు. నేను కొత్త అనే బెరుకు, బిడియం వాళ్లతో మాట్లాడిన కొద్దిసేపట్లోనే పోయాయి. అది వాళ్ల గొప్పతనం.

భోజనాలు అయ్యాక ''రా మేడపైకి. నా గదికి వెళదాం'' అని పిలుచుకువెళ్లాడు. విశాలమైన ఆ గదిలోకి అడుగుపెడుతూనే అది ఒక చిన్న గ్రంథాలయంలాగా అనిపించింది. షెల్ఫ్సులో బుక్స్ అన్నీ అందంగా అమర్చబడి వున్నాయి. దగ్గరకు వెళ్లి చూసాను. అక్కడ అన్నిరకాల పుస్తకాలు తెలుగువీ, ఇంగ్లీషువీ వున్నాయి. ఒక షెల్ఫ్‌లో అచ్చువేసిన నా కవితల పుస్తకం కూడా వుంది. నిజంగా ఆ గది ఒక వైస్‌మార్స్ పారడైజ్.

సాయంత్రం బాలూ నన్ను ఊరి బయటకు తీసుకెళ్లాడు. అక్కడ ఏదో బిల్డింగ్‌కు సంబంధించి కన్‌స్ట్రక్షన్ వర్క్ జరుగుతోంది. ఊరి బయట ఆ బిల్డింగ్ ఏమిటని అడిగాను. ''తను అక్కడ ఒక స్కూలు కట్టిస్తున్నానని, అది ఆ ఊరి పేద పిల్లల కోసమని, అక్కడ చదువుకునే పిల్లలకు అది ఒక చిన్న శాంతినికేతన్ కావాలని, అది తన ఆశయమని'' చెప్పాడు.

బాలూ గొప్పతనం నన్ను కదిలించి వేసింది.


పండగ ఆనందంగా గడిచిపోయింది. రేపే ప్రయాణం. రాత్రి భోజనం చేసిన తరువాత ఇంటి వెనుకనున్న మల్లెపందిరి క్రింద కూర్చున్నాను. చల్లగా వుంటే కళ్లు మూసుకున్నాను. బుగ్గమీద ఎవరో చిన్నగా తట్టడంతో కళ్లు తెరిచి చూసాను. ఎదురుగా బాలు.

ఇద్దరం కలసి బాలూ గదికి వెళ్లాము. బాలూ వచ్చి మంచంమీద నా పక్కగా కూర్చున్నాడు. కొద్దిసేపు వున్న తరువాత బాలూ నా చేతులను తన చేతుల్లోకి తీసుకుని మెల్లగా రాస్తూ చెప్పాడు ''ఆషా! నా జీవితంలో ఇంతవరకూ అనుకున్న ప్రతీదీ కష్టపడి సాధిస్తూ వచ్చాను. ఎమ్‌బిఎ చదివాను. సొంతంగా బిజినెస్ ప్రారంభించి అందులోనూ సక్సెస్ అయ్యాను. ఇప్పుడు నా స్కూల్ ప్రారంభించాను. అంతా సవ్యంగానే జరుగుతోంది. ఇంట్లో అమ్మానాన్నల ప్రేమ, ఫ్రెండ్స్ అభిమానం అన్నీ వున్నాయి. అయినా మనసులో ఏదో వెలితి. నాకు...నాకు నీవు కావాలి ఆషా. నీవు లేకుంటే నా జీవితం అసంపూర్ణమై పోతుంది. నా ఆశలు, ఆశయాలు సాఫల్యం చేసుకోవడానికి నీ తోడ్పాటు నాకు కావాలి. ఆషా! నా జీవితానికి సంపూర్ణత్వాన్ని చేకూర్చడానికి నా సహధర్మచారిణిగా ఉండేందుకు వప్పుకుంటావా?'' బాలూ కంఠంలో వణుకు.

అతను నడిచిన త్రోవ చాలనుకుంటే అతని హృదయంలోనే ప్రతిష్ఠించుకుంటా నంటున్నాడు.

ఆనందం మనసులోంచి కళ్లల్లోకి ప్రవహిస్తుంటే ఉద్వేగంతో అతని అరచేతిని నా పెదవులకు ఆనించుకుని కళ్లు మూసుకున్నాను.

★



## శిల్పా పెళ్లి?

*సాగరకన్య శిల్పా శెట్టి ఇటు దక్షిణాదిలో నిలదొక్కుకోలేక అటు ఉత్తరాదిలో సరైన అవకాశాల్లేక అవస్థపడుతోంది. తనకు హిందీలో ఒకటి అరా అవకాశాలున్నా 'బిజీ హీరోయిన్' కాలేకపోయినందుకు బాధ పెంచుకుని డిప్రెషన్‌లోకి వెళ్లిపోయిందని వినికిడి. శిల్ప డిప్రెషన్ ముందు ముందు మరెంత కీడు చేస్తుందేమోనని భయపడి ఆమె తల్లిదండ్రులు ఓ నిర్ణయానికి వచ్చారట. 'శిల్పకు పెళ్లి చేసేస్తే సంసార జీవితంలోపడి సినిమా అవకాశాలు గురించి మరిచిపోతుంద'ని వాళ్ల ఆలోచన. సో! శిల్ప త్వరలో పెళ్లి కూతురు కాబోతోందా? ఈ విషయమే ఆమెని అడిగితే-'అది వట్టి పుకారు మాత్రమే! నా కెరీర్ బాగోలేదన్నమాట వాస్తవమేగానీ అంత మాత్రాన డిప్రెషన్‌లోకి వెళ్లిపోయేంత పిచ్చిదాన్ని కాదు నేను. అసలు పెళ్లి విషయంలో నిర్ణయం నాదే' అంటూ ఆవేశపడిపోయింది. పెళ్లి విషయంలో హీరోయిన్స్ అబద్ధాలు చెప్పడం సహజమైన సంగతే కదా!*

-జె.వి.బాబు